విజ్ఞాన నిధి



పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు

- నిరుద్యోగులకు పెన్నిధి జిల్లా కేంద్ర గ్రంథాలయం
- అందుబాటులో వేల పుస్తకాలు



వేసవి విజ్ఞాన శిబిరంలో పిల్లలు



మతగ్రంథాలు, తత్వశాస్త్రముల ర్యాక్



సాహితీప్రియుల కోసం తెలుగు నవలలు

దాబాగార్డెన్స్ : నిరుద్యోగులకు విజ్ఞానాన్ని అందిస్తోంది జిల్లా కేంద్ర గ్రంథాలయం. సుమారు 7 దశాబ్దాలుగా విద్యార్థులు, నిరుద్యోగులకు బాసటగా నిలుస్తోంది. ఆరేడు దశాబ్దాల కిందట కేజీహెచ్ అప్ రోడ్డులో ఉండే జిల్లా కేంద్ర గ్రంథాలయం అనివార్య కారణాల వల్ల దశాబ్దం క్రితం జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలో మెలోడి థియేటర్ వద్ద ప్రైవేట్ భవనంలోకి మార్చారు. ఎందరికో విజ్ఞానాన్ని అందిస్తూ ప్రగతిపథంలో దూసుకుపోతోంది.

అన్ని వర్గాల వారికి అందుబాటులో..

ఈ గ్రంథాలయం అన్ని వర్గాలకు అందుబాటులో ఉంది. విద్యార్థులు, నిరుద్యోగులు, చిన్నారులు, సాహితీప్రియులు, వృద్ధులు ఇలా అందరినీ అలరిస్తూ విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తూనే ఉంది. పోటీ పరీక్షలకు వెళ్లే నిరుద్యోగులకు ఎంతో ఉపయోగంగా ఉంది. వీరి కోసం ప్రత్యేకంగా ఓ గది కేటాయించారు. పుస్తకాలు చదువుకునేందుకు ప్రత్యేకంగా టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు. రోజుకు సుమారుగా 150 నుంచి 200 మంది ఈ గ్రంథాలయానికి వస్తుంటారు.

పాఠకులపై ప్రభావం చూపని డిజిటల్ యుగం

సెల్‌ఫోన్ యుగం వచ్చిన తరువాత ప్రపంచం ముంగిట నిలుస్తోంది. అయితే డిజిటల్ గ్రంథాలయాలు కూడా ఆన్‌లైన్‌లో ఉండడంతో ఈ ప్రభావం గ్రంథాలయాలపై పడుతుందేమోనని చాలా మంది పుస్తక ప్రియులు ఆందోళన చెందారు. కానీ ఆ ప్రభావం గ్రంథాలయాలపై లేదని గ్రంథాలయాధికారి చెబుతున్నారు. పాఠకులు, పుస్తకప్రియుల సంఖ్య తగ్గడం లేదని చెబుతున్నారు.

పాఠకులను ఆకట్టుకునేందుకు..

పాఠకులను ఆకట్టుకునేందుకు గ్రంథాలయాల ఆవశ్యకతను తెలియజెప్పేందుకు పలు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా వేసవి సెలవుల్లో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వేసవి సెలవుల్లో విద్యార్థులకు శిక్షణ శిబిరాలు నిర్వహించారు. పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. పలు సంస్థలు, రిసోర్స్ పర్సన్స్ ద్వారా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సాహితీ కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు.

నిరుద్యోగులు, విద్యార్థులకు తొలి ప్రాధాన్యం

నిరుద్యోగులు, విద్యార్థులకు తొలి ప్రాధాన్యతనిస్తున్నామని గ్రంథాలయ అధికారి తెలిపారు. వీరికి ఏ రకమైన పోటీ పరీక్షల పుస్తకాలు అవసరమో గమనించి వాటిని కొనుగోలు చేస్తున్నామని,అలాగే వీరికి ఏ పుస్తకం కావాలో వెంటనే ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన అందుబాటులో తీసుకొస్తున్నామని తెలిపారు.

ఈ గ్రంథాలయానికి ప్రత్యేక స్థానం



జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ప్రత్యేక స్థానముంది. ఇక్కడికి వచ్చేవారికి ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పిస్తున్నాం. వారికి అవసరమైన విధంగా సౌకర్యాలు ఉన్నాయి. ప్రతిరోజూ ఈ గ్రంథాలయానికి వచ్చి పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే పలువురు విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. **ఎల్ రాజేంద్రవర్మ**, అసిస్టెంట్ ఇన్‌చార్జి లైబ్రేరియన్

ఆరిలోవ నుంచి వస్తున్నా..



గత నాలుగేళ్ల నుంచి డీఎస్సీ, పోటీ పరీక్షల కోసం ప్రిపేరవుతున్నా. ఈ గ్రంథాలయానికి ప్రతిరోజూ ఆరిలోవ నుంచి వస్తున్నా. ఇక్కడ పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ అనుకూలంగా ఉంది. **– ఎస్.కె.లక్ష్మి**, ఆరిలోవ, విద్యార్థి

కానిస్టేబుల్‌కి ప్రిపేరవుతున్నా..



కానిస్టేబుల్ పోస్ట్ కోసం ప్రిపేరవుతున్నా. గత రెండేళ్లుగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలోనే ప్రిపేరవుతున్నా. పోతినమల్లయ్యపాలెం నుంచి ఇక్కడకు వస్తున్నా. **– పి.శ్వేత**, పోతినమల్లయ్యపాలెం

రెండేళ్లుగా..



రెండేళ్లుగా కానిస్టేబుల్ పోస్ట్ కోసం ప్రిపేరవుతున్నా. కానిస్టేబుల్‌తో పాటు ఆర్పీఎఫ్, పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్నా. ఇక్కడ మంచి మెటీరియల్ ఉంది. **– ఎ.సంతోష్‌కుమార్**, నిరుద్యోగి, పూర్ణామార్కెట్

గ్రూప్స్‌కి ప్రిపేరవుతున్నా..



ఏపీపీఎస్సీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, సివిల్స్‌కి ప్రిపేరవుతున్నా. మంచి పుస్తకాలు ఉన్నాయి. గ్రూప్స్‌కి ప్రిపేరయ్యేందుకు మంచి వాతావరణం. **–ఎస్.నాగేంద్రకుమార్**, పూర్ణామార్కెట్

క్లుప్తంగా

ఘనంగా అమావాస్య పూజలు



ప్రత్యేక అలంకరణలో దుర్గా అమ్మవారు

సీతమ్మధార : అమావాస్య సందర్భంగా స్థానిక సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీమహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, శ్రీషిర్డీ సాయి బాబా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చకుడు వంశీ అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు నవగ్రహాలకు తైలాభిషేకంతో పూజలు చేశారు. అలాగే భైరవ స్వామికి భక్తులు గుమ్మడికాయలో నెయ్యి దీపాలు వెలిగించారు. అమావాస్య కావడంతో దుర్గా అమ్మవారికి పలు రకాల పువ్వులతో ప్రత్యేక అలంకరణ చేశారు. గురువారం కావడంతో షిర్డీసాయి బాబాకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభం



ఫుట్‌పాత్‌పై విరిగిన విద్యుత్ స్తంభం

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెనపై విద్యుత్ స్తంభం నేలపై పడింది. ఆ సమయంలో అటుగా వాహనాలు, పాదచారుల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం జరగలేదు. ఇటీవల విద్యుత్ స్తంభాలకు రంగులు వేసి కొత్త విద్యుత్ దీపాలు అమర్చారు. బుధవారం వీచిన గాలలకు విద్యుత్ స్తంభం నేలకొరిగింది. విరిగిన స్తంభాన్ని పాదచారులు నడిచే ఫుట్‌పాత్‌పై అడ్డంగా వదిలేశారు. దీంతో అటుగా నడిచే పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్తంభాన్ని తొలగించి విరిగిన దాని స్థానంలో కొత్త విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మహిళలకు మొక్కల పంపిణీ



మురళీనగర్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రభావతి

మురళీనగర్ : పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మురళీనగర్ మహిళలు, వాకర్స్‌కు మొక్కలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల సంరక్షణ నినాదంతో ఇండోర్, ఔట్‌డోర్‌లో పెంపకానికి వీలుగా ఉండే మొక్కలు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి, వాకర్స్ డిస్ట్రిక్ట్ – 101 పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభ, ఎం.జయ, కోశాధికారి జి.షీలా రాణి, సంయుక్త కార్యదర్శి ఎస్.రత్నకుమారి, జి.శిరీషలత, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార : విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం శుక్రవారం ఆశీలుమెట్ట సెక్షన్ ఆఫీస్ 11 కేవీ వుడా చిల్డ్రన్ పార్కు ఫీడర్ పరిధిలో మరమ్మతులు సందర్భంగా సీతమ్మధార హిల్ పార్కు, రాకెట్ పార్కు, ఏఎస్ఆర్‌నగర్, వోల్వో ఆఫీస్, సబ్బం హరి ఇల్లు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్ – 1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిరుపయోగంగా ప్రభుత్వ స్థలం

- ఖాళీగా సులభ్ శౌచాలయ స్థలం
- కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినా ప్రారంభంకాని పనులు



గొల్లకంచరపాలెంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలం



తోటవీధి రైల్వేట్రాక్ రహదారిపై శుభకార్యం చేస్తుండడంతో నిలిపిన వాహనాలు

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం పరిధి గొల్ల కంచరపాలెంలో ప్రభుత్వ స్థలం గత కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంది. గతంలో ఇక్కడ సులభ్ శౌచాలయం వుండగా స్థానికులు వినియోగించేవారు. అనంతరం శిథిలావస్థకు చేరడంతో కూల్చేశారు. అప్పటి నుంచి ఆ స్థలం నిరుపయోగంగా మారింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని శంకుస్థాపన చేసినా కార్యరూపం దాల్చలేదు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని... ఇప్పటికైనా కమ్యూనిటీ హాల్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో అభివృద్ధి జాడ కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. గొల్లకంచరపాలెం నుంచి గౌరీనగర్ వరకు గల తోటవీధి, చెవిటిరాముల వీధి, పల్లీవీధి, దుర్గానగర్, గోకుల్‌నగర్ వరకు గల ప్రజలకు కమ్యూనిటీ హాళ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన వీర హనుమాన్ వ్యాయామ మండలి భవనంలో చాలీచాలని స్థలంలో 265వ నంబరు సచివాలయం నిర్వహిస్తుండడంతో సచివాలయ ఉద్యోగులు, ఆయా క్లస్టర్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వార్డులో పాదుపు సంఘం మహిళలకు, స్థానికులు శుభకార్యాలు చేసుకునేందుకు సరైన కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో అటు బీఆర్‌టీఎస్ రహదారి, రైల్వేట్రాక్‌లు దాటి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో సచివాలయ ఉద్యోగులు, ప్రజలకు ఉపయోగపడేలా విశాలమైన సచివాలయం, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మించాలి



జోన్ – 5 పరిధిలో కమ్యూనిటీ హాళ్లు లేకపోవడంతో మహిళలు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులపై కార్యక్రమాలు జరుపుకునే పరిస్థితి కనిపిస్తోంది. వార్డులో స్థలాలున్నా నిర్మాణాలు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు జీవీఎంసీ జోనల్ అధికారులు శంకుస్థాపన చేసినా పనులు చేపట్టలేదు.
– పారిపల్లి నూకరత్నం, తోటవీధి, కంచరపాలెం

నిర్మాణానికి చర్యలు



వార్డులో జీవీఎంసీ కమ్యూనిటీ హాల్ అందుబాటులో ఉంది. వాటిలో సచివాలయాల సిబ్బంది ప్రజలకు సేవలు అందిస్తున్నారు. స్థలాన్ని పరిశీలించి, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతాం. త్వరలో నిర్మాణ పనులు జరిగేటట్లు చర్యలు చేపడతాం.
– ఆర్‌జీవీ కృష్ణ, జోనల్ కమిషనర్, జోన్ – 5 జ్ఞానాపురం

ప్రైవేటు ట్రావెల్ బస్సులతో ఇక్కట్లు

రోడ్డుపై నిలిపివేయడంతో రాకపోకలకు తీవ్ర అవస్థలు



రామాటాకీస్ రోడ్డులో అంబేడ్కర్ భవన్ వద్ద రోడ్డుపై ప్రైవేట్ ట్రావెల్ బస్సు, సామగ్రి

సీతంపేట : ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులతో ఇక్కట్లు తప్పడం లేదు. రామా టాకీస్ రోడ్‌లో ఒకవైపు పికప్ పాయింట్... మరోవైపు డ్రాపింగ్ పాయింట్ నిర్వహించడంతో ఆ మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో జనం ఇబ్బంది పడుతున్నారు. రామా టాకీస్ రోడ్‌లో అంబేడ్కర్ భవన్ ఎదుట స్థలాన్ని ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ప్రయాణికుల డ్రాపింగ్ పాయింట్‌గా వినియోగిస్తున్నారు. విజయవాడ, హైదరాబాద్, చెన్నై, తిరుపతి, బెంగళూరు వంటి సుదూర ప్రాంతాల నుంచి ప్రైవేట్ ట్రావెల్ బస్సుల్లో వచ్చే ప్రయాణికులు అంబేడ్కర్ భవన్ పాయింట్ వద్ద దిగుతున్నారు. అలాగే బస్సుల్లో కార్గో సర్వీస్ ద్వారా వచ్చే లగేజీని కూడా ఇక్కడే రోడ్డుపై దింపుతున్నారు. రోడ్డును ఆక్రమించి బస్సులను గంటల తరబడి నిలిపివేయడంతో పాటు లగేజీ, కార్గో రోడ్డుపై డంప్ చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఇదేవిధంగా ఇబ్బంది ఉంటుందని వాపోతున్నారు. అలాగే ప్రభుత్వ కంటి ఆస్పత్రి వద్ద పికప్ పాయింట్ నిర్వహించడంతో రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 వరకు బస్సులు బారులు తీరుతున్నాయని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

దోమల నియంత్రణకు ఫాగింగ్



అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌లో ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతంపేట : దోమల నియంత్రణకు జీవీఎంసీ 26వ వార్డులోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం మినీ ఫాగింగ్ నిర్వహించారు. బోరావారి వీధి, లలితానగర్, చాకలిపేట, రామకృష్ణానగర్, మంగళవీధి, శంకువానిపాలెం ప్రాంతాల్లో జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది ఫాగింగ్ నిర్వహించారు. నీరు నిల్వ చేయకుండా వారానికి ఒక రోజు డ్రై డే పాటించాలని, తద్వారా దోమల పెరుగుదలను నియంత్రించవచ్చని స్థానికులకు అవగాహన కల్పించారు. జీవీఎంసీ సిబ్బంది కె.శివ, సత్యనారాయణ, ఎం.అప్పలరాజు పాల్గొన్నారు.

లలిత పీఠంలో ప్రత్యంగిరా హోమం



లలితపీఠంలో ప్రత్యంగిరా భద్రకాళి హోమంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట : స్థానిక లలితపీఠంలో అమావాస్య సందర్భంగా గురువారం శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి అనుగ్రహంతో పండితుల వేదమంత్రాల మధ్య హోమం శాస్త్రోక్తంగా జరిపారు. పరిసర ప్రాంత భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు లలితపీఠంలో ప్రతీ నెల అమావాస్య రోజున ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శత్రు నాశనం, ఆర్థిక ఇబ్బందులు తొలగేందుకు, కోర్టు కేసుల్లో విజయం, ఉద్యోగ అభివృద్ధి విషయంలో శుభ ఫలితాల కోసం ఆది పరాశక్తి ప్రత్యంగిరాదేవి అనుగ్రహం పొందేందుకు హోమం నిర్వహించినట్టు తెలిపారు. హోమంలో పాల్గొన్న వారికి సర్వదుష్ట గ్రహ బాధలు, శత్రు ప్రయోగ బాధలు, ఆర్థిక, అనారోగ్య, కుటుంబ బాధలు తొలగిపోయి, కోరికలు తీరుతాయన్నారు. అలాగే ఉదయం పీఠంలో శనీశ్వరుని జయంతి సందర్భంగా శనీశ్వరునికి తైలాభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

పురందేశ్వరిని కలిసిన ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



పురందేశ్వరితో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరిని విజయవాడలో విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా శాలూవా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనతోపాటు అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి పరశురాంరాజు, ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి సురేష్‌బాబు కలిశారు.

మిద్దె పంటల సాగును ప్రోత్సహిద్దాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న అరుణకుమారి

మురళీనగర్ : నగరంలో నివసించే వారు మిద్దె పంటలు సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని వనమాలి గ్రూపు అడ్మిన్ ఎ.అరుణకుమారి సూచించారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో గురువారం సాయంత్రం వనితా వాకర్స్ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్కనీల్లో మొక్కల పెంపకం విధానాలను వివరించారు. ఆర్గానిక్ కూరగాయల పెంపకానికి అవసరమైన కంపోస్టు ఎరువుల తయారీ విధానాన్ని తెలిపారు. కార్యక్రమంలో వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి, కార్యదర్శి ఎం.విజయ, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రజా మరుగుదొడ్లు



నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లో నిరుపయోగంగా వున్న ప్రజా మరుగుదొడ్లు



నక్కవానిపాలెంలో నిరుపయోగంగా వున్న మరుగుదొడ్లు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ప్రజా మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. స్థానికుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు ఇప్పటి వరకు ప్రారంభించకుండా తాళాలు వేయడంతో వాటర్ ట్యాంక్ పాడైపోవడంతోపాటు రేకులు తుప్పు పడుతున్నాయి. పది మందికి ఉపయోగపడాల్సిన మురుగుదొడ్లు దిష్టిబొమ్మలుగా మిగిలాయి. వెంటనే మరుగుదొడ్లు ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

- జీవీఎంసీ 14వ వార్డులోని నక్కవానిపాలెంలో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. అప్పటి 26వ వార్డులోని ఎ.ఎం.జి.రోడ్డులో మహా విశాఖ నగరపాలక సంస్థ మరుగుదొడ్లు 2002లో కార్పొరేటర్ పెందుర్తి పుష్పాంజలి ప్రారంభించారు. వాటిని కొద్ది కాలం ప్రజలు ఉపయోగించారు. గత కొద్ది కాలం నుంచి ఎప్పుడు చూసినా మరుగుదొడ్లకు తాళం వేసి కనిపిస్తోంది. పైన బోర్డులో మాత్రం ఉదయం 4 గంటల నుంచి రాత్రి 10 వరకు తెరిచి వుంటాయి అని బోర్డు ఏర్పాటు చేశారు. జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకుని మరుగుదొడ్ల తాళాలు తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మాధవధారలో పోలీసుల బందోబస్తు



షాపుల వద్ద పరిశీలిస్తున్న సీఐ చక్రధర్

మద్దిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీలో గురువారం సాయంత్రం ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ ప్రాంతంలో సంత నిర్వహించడంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ చక్రధర్ సిబ్బందితో కలిసి సాయంత్రం నుంచి రాత్రి వరకు పరిశీలించారు. చుట్టుపక్కల రెండు మూడు కిలోమీటర్ల దూరం నుంచి అన్ని వర్గాల ప్రజలు సంతకు వచ్చి సరకులు కొనుగోలు చేసుకుంటారు. ఈ క్రమంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



వాహనదారులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

మద్దిపాలెం: కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. తాటిచెట్లపాలెం, బర్మాక్యాంప్, బిర్లా, ఊర్వశి, బిర్లా జంక్షన్, పంజాబ్ హోటల్, ఆర్అండ్‌బీ, ఎన్ఏడీ వరకు కంచరపాలెం ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు, సిబ్బందితో కలిసి వాహనదారులను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను నడిపిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.